# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 01 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## తెలంగాణలో వర్షాల హెచ్చరిక

- కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో కొన్ని రోజుల వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సూచించింది. ఈ నేపథ్యంగా ప్రజలకు జాగ్రత్తగా ఉండమని ఏలో అలెర్ట్ జారీ చేశారు. బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఉత్తర కోస్తాంధ్ర మీదుగా కొనసాగుతోంది. సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తుకు చేరిన ఈ వాతావరణం దక్షిణ దిశకు వంగి ఉంది. ఉత్తర అండమాన్‌లో కూడా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉంది. అక్టోబర్ 1న బంగాళాఖాతం మధ్య ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది.

**రెండు రోజుల కీలక అంచనాలు:**

అక్టోబర్ 2: ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయువ్య దిశగా కదిలి, పశ్చిమ%-%మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉంది.

అక్టోబర్ 3: పశ్చిమ వాయువ్య దిశలో కదులుతూ దక్షిణ ఒడిశా%-%ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉంది.

మిగితా 2వ పేజీలో

## తిలక్ వర్మను సత్కరించిన సీఎం రేవంత్ రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆసియా కప్-2025లో టీమిండియాకు విజయం తేవడంలో కీలకపాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. హైదరాబాద్ చేరుకున్న తిలక్ వర్మ, జూబ్లీహిల్స్‌లోని సీఎం అధికారిక నివాసంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, తిలక్ వర్మతో పాటు ఆయన కోచ్ సలాం బయాష్ను ఘనంగా సత్కరించారు. తన విజయానికి గుర్తుగా తిలక్ వర్మ, తన క్రికెట్ బ్యాట్‌ను ముఖ్యమంత్రికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

- హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై 500 కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకట్టుకున్న లేజర్ 'త్రీడీ' షో
- పాల్గొన్న మంత్రులు జూపల్లి, పొన్నం, కొండా సురేఖ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతకమ్మ పండుగలో చివరి ఘట్టమైన సద్దుల బతుకమ్మ వేడుకలను హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై మంగళవారం ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




సాయంత్రం 5 గంటలకు సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మారక కేంద్రం నుంచి 700 బతుకమ్మలతో మహిళలు ఊరేగింపుగా ట్యాంక్‌బండ్ పైకి చేరుకున్నారు. వీరితోపాటు 500మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వచ్చి వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను అందంగా అలంకరించారు. బతుకమ్మ చుట్టూ.. చప్పట్లు కొడుతూ, పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్, హుస్సేన్‌సాగర్‌లో తేలియాడే బతుకమ్మలు, సెక్రటేరియట్‌పై 3డీ మ్యాప్ లేజర్‌షో బుద్ధవిగ్రహం, సంజీవయ్య పార్క్ వద్ద లేజర్ షోల ప్రదర్శన ఆకట్టుకుంది. హైదరాబాద్ నగరంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

బతుకమ్మ పండుగలో వెస్ట్రన్ కల్చర్‌ను జొప్పించి గత సర్కార్ పండుగ ప్రాముఖ్యతను దెబ్బతీసిందని రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. స్వరాష్ట్రం ఏర్పడ్డ తర్వాత పదేండ్లు అధికారం చెలాయించిన బీఆర్ఎస్ ప్రభుత్వంలోని కొంతమంది బతుకమ్మను తామే తెచ్చామని చరిత్రకు వక్ర బాష్యం చెప్పారని విమర్శించారు. తెలంగాణలోని మహిళలు బతుకమ్మ పండుగను.. పండుగలా జరుపుకోవాలని కోరారు. తమ సర్కార్ ఏర్పడ్డ తర్వాత రెండో సారి నిర్వహిస్తున్న బతుకమ్మ వేడుకలు గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, కార్పొరేషన్ చైర్మెన్లు నిర్మలా జగ్గారెడ్డి, వెన్నెల గద్దర్, కాల్వ సుజాత, నేరేళ్ల శారద, అలెక్య పంజాల పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్‌రంజన్, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెత్తర అమావాస్య రోజు ఎంగిలిపూల బతుకమ్మతో మొదలైన సంబరాలు సద్దుల బతుకమ్మతో ముగిసాయి. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా పువ్వులను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రాంతానికే సొంతం. జీవితమంతా సంతోషంగా సాగిపోవాలనేది పండుగ ఆంతర్యం. గునుగు, తంగేడు, పట్టుకుచ్చు, బంతి, చామంతి వంటి రకరకాల పూలతో బతుకమ్మను పేర్చి మహిళలంతా గుమిగూడి పాటలు పాడుతూ బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యంగా సమర్పించి పండుగ ప్రాముఖ్యతను చాటారు.



## ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయొద్దు




- గేమింగ్ యాప్స్, సైబర్‌క్రైమ్‌పై ప్రత్యేక దృష్టి
- హైదరాబాద్ నూతన సీపీగా బాధ్యతలు స్వీకరించిన సజ్జనార్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ప్రతి ఒక్కరు సిటిజన్ పోలీసే అని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ అన్నారు. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం ఉదయం 8:29 నిమిషాలకు బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సీవీ ఆనంద్ నుంచి ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆర్టీసీ ఎండీగా ఉన్న ఆయనను ప్రభుత్వం నగర సీపీగా బదిలీ చేసిన సంగతి తెలిసిందే. 1996 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ గతంలో సైబరాబాద్ కమిషనర్‌గా పని చేశారు. నగర సీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని తెలిపారు. నగరంలో నేరాలను తగ్గించడంతోపాటు మాదక ద్రవ్యాల నివారణ, ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. నేరస్తులపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, గేమింగ్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. హైదరాబాద్ పోలీసులు మీ పోలీసులని ఏ సమస్య వచ్చినా తమకు తెలిపాలని కోరారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అక్కడ పరిష్కారం కాకుంటే ఏసీపీ వద్దకు వెళ్లాలన్నారు. ఆ తర్వాత పైస్థాయి అధికారికి లేదా నేరుగా తన దృష్టికి తీసుకొచ్చినా పర్వాలేదన్నారు. ఎక్కడ శాంతి భద్రతలు బాగుంటాయో ఆ నగరం అభివృద్ధి చెందుతుందని, హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచేందుకు అన్ని విధాలా కృషిచేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు సీపీలు, జాయింట్ సీపీలు, అన్ని జోన్ల డీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

## 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధం

- కేంద్ర ప్రభుత్వం సహకరించాలి
- కేంద్రానికి మంత్రి ఉత్తమ్ లేఖ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉన్నామనీ, కేంద్రం తగిన సహకారం ఇవ్వాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆహారం, ప్రజాపంపిణీ, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాశారు. రికార్డుస్థాయిలో సేకరణ లక్ష్యాలకు అనుగుణంగా డెలివరీ నిబంధన లు సడలించాలని, అదనపు నిల్వ, రవాణా సౌకర్యాలను కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 45-50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నటి వరి, 30-35 లక్షల మెట్రిక్ టన్నుల ముతక ధాన్యం సేకరించనున్నట్టు ఆయన వెల్లడించారు. క్వింటాలు ధాన్యానికి కనీస మద్దతు ధర రూ.2,389 నిర్ణయం మేరకు 80 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు దాదాపు రూ.20 వేల కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. బోనస్ చెల్లింపులు, రవాణాతో కలిసి ఖర్చు రూ.24 వేల నుంచి రూ.26 వేల కోట్ల మధ్య పెరుగుతుందని వివరించారు.

కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును ఈ ఏడాది నవంబర్ 12 వరకు పొడిగిస్తూ, పార్బాయిల్డ్ రైస్‌గా మాత్రమే సరఫరాను తప్పనిసరి చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై ఉత్తమ్ కుమార్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ముడి బియ్యం మార్పిడికి ఖరీఫ్ వరి మరింత అనుకూలంగా ఉంటుందనీ. అందుబాటులో ఉన్న స్టాక్‌లో, 7.80 లక్షల మెట్రిక్ టన్నులు ముడి బియ్యం మిల్లర్ల వద్ద ఉన్నాయి. అయితే 1.67 లక్షల మెట్రిక్ టన్నుల వరి (1.13 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి సమానం) బాయిల్డ్ రైస్ మిల్లర్ల వద్ద ఉంది. లభ్యతను బట్టి ముడి, బాయిల్డ్ రైస్ రెండింటినీ డెలివరీ చేయడానికి అనుమతివ్వాలనీ, బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని రబీ సీజన్‌కు మార్చాలని ఉత్తమ్ కోరారు.

సెప్టెంబర్ చివరి నాటికి ఖరీఫ్ 2024-25 నుంచి 5.44 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్, రబీ 2024-25 నుండి 14.92 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ పంపిణీ చేయలేదని ఆయన పేర్కొన్నారు. దీని ఫలితంగా మిల్లర్లు కార్యకలాపాలను నిలిపివేయగా,

మిగితా 2వ పేజీలో

## బీజేపీ సీనియర్ నేత మల్హోత్రా కన్నుమూత




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీజేపీ సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్ మల్హోత్రా(93) మంగళవారం ఢిల్లీలో కన్నుమూశారు. 1931 డిసెంబర్ 3న లాహోర్‌లో జన్మించిన ఆయన రాజకీయ జీవితం జన్‌సంఘ్‌తో మొదలైంది. ఆ తర్వాత ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు పనిచేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఐదుసార్లు ఎంపీగా గెలుపొందారు. ఢిల్లీ ముఖ్య నేతల్లో ఒకరిగా ఎదిగిన ఆయన 1999 లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై విజయం సాధించారు. 'ఎక్స్' వేదికగా మల్హోత్రా మృతికి ప్రధాని మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్ నివాళి అర్పించారు. పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవల్ని గుర్తుచేసుకున్నారు.

## బాకీ కార్డులు బ్రహ్మాస్త్రం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ కార్డులోని పథకాలను.. అమలు చేయకుండా ప్రజలకు బాకీ పడింది. ఆ బాకీలను కార్డు రూపంలో ప్రచురించాం. అవి మనకు బ్రహ్మాస్త్రం.. వాటిని ఇంటింటికి పంపిణీ చేయాలి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జరిగిన 'కాంగ్రెస్ బాకీ కార్డు' విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఏం బాకీ పడింది? ఒక్కొక్క మహిళకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క రైతుకు ఎంత బాకీ పడింది? ఒక్కొక్క ఇంటికి ఎంత బాకీ పడ్డదో తెలిసేలా బాకీ కార్డు విడుదల చేస్తున్నామని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు పండుగకు ఊర్లకు వస్తారనీ, రేపు నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ బాకీ కార్డు పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి రైతుకు కాంగ్రెస్ పార్టీ రూ.75 వేల రైతుబంధు బాకీ పడిందన్నారు. రైతుబంధు రైతుకి ఇస్తాం, కౌలు రైతుకి ఇస్తామన్నారని.. కానీ ఇప్పటివరకు ఒక రూపాయి అయినా ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలకు ప్రకటించిన రూ.2500 పథకం ద్వారా రూ.44వేలు బాకీ పడ్డారన్నారు. అవి ఇచ్చిన తర్వాతే.. కాంగ్రెస్ వాళ్ళు ఎవరైనా ఓటు అడగాలని తెలిపారు. అలాగే, జాబ్ క్యాలెండర్ కూడా ఇవ్వలేదని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బంద్ అయిందన్నారు. పండుగ పూట కనీసం కరెంటు బుగ్గలు పెట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'గ్యారంటీలకు టాటా చెప్పిండు.. లంక బిందెల కోసం రేవంత్ రెడ్డి వేట పట్టిండు" అని అన్నారు. కంచె గచ్చిబౌలి, బంజారా హిల్స్, జూబ్లీహిల్స్‌లో భూములు అమ్ముతా అని బయలుదేరిండని ఆరోపించారు. తమిళనాడులో అక్కడి గవర్నమెంట్ పొద్దున్న టిఫిన్ పెడుతుందని పొగిడిన సీఎం.. కేసీఆర్ ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అధికారంలోకి వచ్చినంక ఎందుకు బంద్ పెట్టారని ప్రశ్నించారు. ఢిల్లీకి మూటలు కట్టడానికి, కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు తీసుకొని బీహార్ ఎన్నికలకు పంపడానికి పైసలు ఉన్నాయి గానీ.. ఇచ్చిన గ్యారంటీలు అమలు చేయడానికి మాత్రం పైసలు లేవా అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు తుది ఓటర్ల జాబితా విడుదల

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో త్వరలో జరగనున్న ఉప ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల అధికారులు సన్నాహాలు జరుపుతున్నారు. ఈ క్రమంలో తుది ఓటర్ల జాబితా మంగళవారం మధ్యాహ్నం విడుదలైంది. జాబితా ప్రకారం, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 3,98,982 మంది, ఇందులో:

పురుష ఓటర్లు: 2,07,367 మంది

మహిళా ఓటర్లు: 1,91,590 మంది

ట్రాన్స్‌జెండర్ ఓటర్లు: 25 మంది

గత ఎన్నికలతో పోల్చితే 1.61 శాతం పెరుగుదల నమోదైంది.

**80 ఏళ్ల పైబడి ఉన్న ఓటర్లలో:**

పురుషులు: 3,280

మహిళలు: 2,772

18-19 ఏళ్ల వయసు వారిలో 6,106 ఓటర్లు ఉన్నారు. దివ్యాంగ ఓటర్లు 1,891 మంది:

చూపులేని వారు: 519

శారీరక వైకల్యం: 667

వినికిడి లోపం: 311

ఇతర వైకల్యం: 722

ఎన్నారై ఓటర్లు: 95 మంది.

తుది ఏర్పాట్ల ప్రకారం, నియోజకవర్గ వ్యాప్తంగా 139 లోకేషన్లలో 407 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 2న విడుదల చేసిన ప్రాథమిక జాబితాలో 3,92,669 ఓటర్లు ఉన్నారు. సవరణల అనంతరం కొత్తగా 6,976 ఓటర్లు చేరగా, 663 మంది ఓటర్లను తొలగించారన్నారు.

## చెన్నై పవర్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం



- 9 మంది కార్మికుల మృతి

**బలగం టీవి, చెన్నై**

చెన్నైని ఎన్నూర్ ప్రాంతంలోని థర్మల్ పవర్ ప్లాంట్ విస్తరణ పనుల సమయంలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మంగళవారం స్కాఫోల్డింగ్ అకస్మాత్తుగా కూలిపోవడంతో తొమ్మిది మంది కార్మికులు అక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులందరూ ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కార్మికులు అని అధికారులు వెల్లడించారు. ప్లాంట్ ముఖభాగంలో జరుగుతున్న భారీ ఆర్చ్ నిర్మాణంలో పాల్గొన్న సమయంలో స్కాఫోల్డింగ్ పైన పడిన మృతదేహాలు తీవ్ర స్థాయిలో నుజ్జునుజ్జుగా అయ్యాయి. మరికొందరు కార్మికులు గాయాలతో చెన్నై రాయపురం స్టాన్లీ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు, అందులో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రాంతీయ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు నివారించేందుకు భవిష్యత్తులో కఠిన భద్రతా నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు.

చెన్నైని ఎన్నూర్‌లో నిర్మాణదశలో ఉన్న థర్మల్ పవర్ ప్లాంట్ లో మంగళవారం జరిగిన ప్రమాదంలో 9 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాల పట్ల ప్రత్యేక దయ చూపుతూ, ప్రధాని కార్యాలయం వెల్లడించిన ప్రకారం, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడినవాళ్లకు రూ.50,000 నష్టపరిహారం జాతీయ రిలీఫ్ ఫండ్ నుంచి చెల్లించబడనుందని తెలిపారు.

తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలిస్తామని ప్రకటించారు.

ప్రధాని మోడీ మాట్లాడుతూ, "థర్మల్ ప్లాంట్ ప్రమాదం వార్త తెలిసి ఎంతో ఆవేదనకు గురయ్యాను. ఈ కష్ట సమయంలో నా ఆలోచనలన్నీ బాధిత కుటుంబాలపై ఉన్నాయి. గాయపడినవాళ్లు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు.

## సిరిసిల్లలో లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీశాల లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్నపన తిరుమంజనంతో మొదలైన ఈ ఉత్సవాలు అక్టోబర్ 8 వరకు వైభవంగా సాగనున్నాయి. విశేషంగా, ఇక్కడి బ్రహ్మోత్సవాలు తిరుమల శ్రీవారి ఉత్సవాల తరహాలో నిర్వహించడం ప్రత్యేకత. వాహనసేవలు, భారీ రథోత్సవం భక్తులను ఆకట్టుకోనున్నాయి.

ఉదయం ఆరాధన, సేవాకాలం, బాలభోగం, శాత్తుమురై, శాంతిపాఠం కార్యక్రమాలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ, గరుడ ప్రసాద వితరణ జరగగా సాయంత్రం శేషవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

అక్టోబర్ 1: ఉదయం ప్రత్యేక హోమాలు, సాయంత్రం హంసవాహన సేవ

అక్టోబర్ 2 (దసరా): ఉదయం సింహవాహనం, సాయంత్రం అశ్వవాహనం %-% మానేరు తీరం వద్ద శమీ దర్శనం

అక్టోబర్ 3: గరుడవాహనం, స్వామివారి కల్యాణ మహోత్సవం

అక్టోబర్ 4: సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు

అక్టోబర్ 5: అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ, రాత్రి గజవాహనం

అక్టోబర్ 6: పొన్నవాహనసేవ

అక్టోబర్ 7 (పౌర్ణమి): రథోత్సవం (సాయంత్రం 5 గంటలకు), రాత్రి అశ్వవాహనం

అక్టోబర్ 8: చక్రస్నానం, పుష్పయాగం, ధ్వజావరోహణం, ఏకాంతసేవతో మహోత్సవాల ముగింపు

ఉత్సవాల ప్రారంభం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతోంది. ప్రత్యేకంగా వాహనసేవలు, రథోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని ఆలయ అధికారులు తెలిపారు.

## కాల్పుల విరమణకు ఒప్పందం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరియు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వాషింగ్టన్ డీసీలో సమావేశమయ్యారు. చర్చల అనంతరం గాజాలో కాల్పుల విరమణపై ఒప్పందం ఏర్పడిందని ప్రకటించారు. ఈ సందర్భంగా వారు సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పాలస్తీనాలో దీర్ఘకాలంగా సాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే 20 సూత్రాల ప్రణాళికను విడుదల చేశారు. ట్రంప్ ప్రకారం, ఈ ప్రణాళిక ద్వారా: గాజాలో యుద్ధాన్ని నిలిపివేయడం, బందీలను విడుదల చేయడం, తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటు, ప్రముఖ లక్ష్యాలుగా ఉన్నాయి.

అమెరికా-ఇజ్రాయెల్ సహకారం: ట్రంప్ తెలిపారు, హమాస్ ప్రతిపాదనను అంగీకరించకపోతే ఆ గ్రూపును పూర్తిగా నిర్మూలించేందుకు ఇజ్రాయెల్‌కు అమెరికా సంపూర్ణ సహకారం అందిస్తుందని. నెతన్యాహు గాజాలో

మిగితా 2వ పేజీలో

## సీజనల్ వ్యాధుల కేసుల్లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

- మంత్రి దామోదర

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సీజనల్ వ్యాధుల కేసుల్లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రదర్శనను మంత్రి పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధుల పూర్తి నియంత్రణకు ఈ ఏడాది తీసుకున్న చర్యలను అధికారులు మంత్రికి వివరించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు తగ్గుముఖం పట్టాయని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో ప్రజారోగ్య శాఖ సీజనల్ వ్యాధుల నిర్మూలనలో ముందస్తు నివారణ చర్యలు చేపట్టడం వల్లే కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టాయని అధికారులు మంత్రికి వివరించారు.

# రూ. 6 కోట్ల విలువైన 1210 కిలోల గంజాయి పట్టివేత




**బలగం టీవీ, హైదరాబాద్**

ఒడిస్సా నుంచి రాజస్థాన్‌కు హైదరాబాద్ గుండా రూ. 6 కోట్ల విలువైన 1210 కిలోల గంజాయిని సరఫరా చేస్తుండగా రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు ఇంత పెద్ద మొత్తంలో గంజాయి లభ్యం కావడం ఇదే మొదటిసారి అని రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ సుధీర్ బాబు తెలిపారు. మంగళవారం ఎల్‌బీనగర్‌లో ఉన్న సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు.

రాజస్థాన్ జోద్‌పూర్‌కు చెందిన లారీ డ్రైవర్ విక్రమ్ విష్ణోయి అలియాస్ వికాస్ తన వాహన యజమాని రాంలాల్ ఆదేశం మేరకు గంజాయిని ఒడిస్సా నుంచి రాజస్తాన్‌కు తరలిస్తున్నాడు. అక్కడ డెవిలాల్ అలియాస్ కట్టు, అయూబ్‌ఖాన్ డ్రగ్స్ రిసీవర్‌లుగా ఉన్నారు. డ్రైవర్ ఖమ్మం మార్గ మధ్యలో ఆగి సిమెంట్ బస్తాలను పైన ఉంచి కింద గంజాయిని పెట్టి హైదరాబాద్ మీదుగా రాజస్థాన్‌కు బయల్దేరాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు, అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులు సంయుక్తంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలంలోని కొత్త గూడెం గ్రామం వద్ద లారీని పట్టుకున్నారు. గంజాయి, లారీ (ఆర్‌జే 19 జీహెచ్ 9295), మొబైల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు సీపీ వెల్లడించారు. నిందితున్ని రిమాండ్‌కు తరలించి మిగతా వారి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ షాకీర్ హుస్సేన్, ఎస్‌ఓటీ ఏసీపీ సత్తయ్య, ఇన్‌స్పెక్టర్ అశోక్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

# భయపెట్టే రాజకీయాలను ఆపండి

**రాహుల్ గాంధీ**



**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ లడఖ్ ప్రజల సమస్యలపై కేంద్రాన్ని మంగళవారం జాగ్రత్త పడాలని కోరారు. లడఖ్‌లో ఇటీవల జరిగిన హింసాత్మక ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై నిష్పక్షపాత న్యాయ విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు, "తండ్రి సైనికుడు, కొడుకు కూడా సైనికుడు. వారి రక్తంలో దేశభక్తి ప్రవహిస్తోంది. అయినప్పటికీ లడఖ్ కోసం, హక్కుల కోసం నిలబడినందుకు బిజెపి ప్రభుత్వం ధైర్యవంతుడైన కొడుకును కాల్చి చంపింది. ఆ తండ్రి కళ్లు కన్నీళ్లు పెట్టుకుంటూ అడుగుతున్న ప్రశ్న – 'దేశానికి సేవ చేసినందుకు ఈ రోజు దక్కిన ప్రతిఫలం ఇదేనా?'" రాహుల్ గాంధీ మరింత చెప్పారు, "లడఖ్‌లో బిజెపి చేసిన ఈ హత్యలపై నిష్పక్షపాత విచారణ జరగాలి. దోషులకు కఠినమైన శిక్ష విధించాలి. మోడీజీ, మీరు లడఖ్ ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు కూడా హింసను, భయపెట్టే రాజకీయాలను ఆపండి."

## గాంధీ జయంతి వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా చేపట్టండి

**హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

**బలగం టీవీ, హైదరాబాద్**

గాంధీ జయంతి నేపథ్యంలో చేపట్టిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం బాపు ఘాట్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం బాపూ మ్యూజియం హాల్‌లో ఏర్పాట్లపై చేపట్టిన సమావేశంలో అదనపు కలెక్టర్ జి ముకుంద రెడ్డితో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా కేటాయించిన పనులను నిర్దేశించిన సమయానికి పూర్తి చేసి అందించాలన్నారు. అలాగే అధికారులందరూ సమన్వయంతో కలిసి పని చేయాలని సూచించారు.

## జర్మనీలో భర్త ఆచూకీ కోసం సీఎం ప్రజావాణిలో మహిళ ఫిర్యాదు

- **వేగంగా చిన్నారెడ్డి చర్యలు**
- **జర్మనీ, కెనడాలోని భారత ఎంబసీలకు లేఖ**

**బలగం టీవీ, హైదరాబాద్**

కెనడాలో నివాసముంటున్న తనకు చెప్పకుండా జర్మనీకి వెళ్లిపోయిన భర్త ముజమిల్‌గులాబ్ నాయక్ వాడి ఆచూకీ కనుగొని న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఓల్డ్ మలక్‌పేట్‌కు చెందిన షబానా నస్రిన్ అహ్మద్ సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తక్షణం స్పందించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ సీఎం ప్రజావాణి ఇన్‌ఛార్జి డాక్టర్ జి. చిన్నారెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రికి లేఖ రాసి నస్రీన్‌కు న్యాయం చేయాలని కోరారు. శేషాద్రి ఆదేశాల మేరకు రాష్ట్ర సచివాలయ సాధారణ పరిపాలనా విభాగం ఎన్నారై విభాగం అధికారులు జర్మనీ, కెనడా ఇండియన్ ఎంబసీలకు, కేంద్ర ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వ శాఖలకు ఉత్తరం ద్వారా సమాచారం ఇచ్చారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఎన్నారై మహిళా విభాగం అదనపు పోలీస్ డైరెక్టర్ జనరల్‌ను సైతం కోరుతూ కూడా జీఏడీ ఎన్నారై విభాగం అధికారులు లేఖ రాశారు. ఈ మేరకు సీఎం ప్రజావాణి ఇంచార్జ్ జి చిన్నారెడ్డికి జీఏడీ ఎన్నారై విభాగం సంయుక్త కార్యదర్శి శివలింగయ్య తిరుగు సమాధానమిచ్చారు. ఈ వ్యవహారం అంతా చకచకా నాలుగు రోజుల్లో జరిగిపోయింది.

కర్నాటక రాష్ట్రానికి చెందిన ముజామిల్‌తో ఆరేండ్ల క్రితం పెళ్లి జరిగిందనీ, కెనడా నుంచి ఇండియాకు రావాలంటే తన నాలుగేండ్ల బిడ్డకు ఇండియన్ పాసుపోర్టు సహా పలు డాక్యుమెంట్స్‌పై తండ్రి సంతకాలు అవసరమనీ, భర్త ఆచూకీ కోసం షబానా నస్రిన్ ఇచ్చిన పవర్ ఆఫ్ ఆటార్నీ ద్వారా తల్లి సెప్టెంబర్ 19న సీఎం ప్రజావాణిలో అర్జీ ఇచ్చారు. చిన్నారెడ్డి తక్షణ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. తెలంగాణ ఆడబిడ్డకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆమెకు పూర్తి భరోసాను కల్పిస్తూ నస్రీన్‌కు న్యాయం చేసేందుకు యావత్ ప్రభుత్వ యంత్రాంగం కషి చేస్తున్నది. ఈమేరకు ప్రజావాణి విభాగం ఒక ప్రకటన విడుదల చేశారు.

# 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పని లేకపోవడంతో కార్మికులు రైస్ మిల్లులను వదిలి వెళ్ళాల్సి వచ్చిందని చెప్పారు.

రాష్ట్రంలోని ఎఫ్‌సీఐల నిల్వ సామర్థ్యం 22.61 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, 21.72 లక్షల మెట్రిక్ టన్నులు ఇప్పటికే నిండి ఉన్నాయని, కేవలం 0.89 లక్షల మెట్రిక్ టన్నులకు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు. నెలకు కనీసం 300 ప్రత్యేక రేక్‌లను (రైళ్లు) ఇవ్వాలని ఆయన సూచిం చారు. అదనపు నిల్వ స్థలాన్ని లీజుకు ఇవ్వమని మేము ఎఫ్‌సీఐ కోరారు. 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం (53.73 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానం) సేకరణకు ఆమోదం తెలిపారనీ, మరో 10 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కోరారు. 80 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమైన 53.60 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని, లేకుంటే లక్షలాది మంది రైతులు ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులను ఎదుర్కొంటారని మంత్రి ఉత్తమ్ ఆందోళన వ్యక్తం చేశారు. గత రబీ సీజన్‌లో తెలంగాణ 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించగా, కేంద్రం 53 లక్షల మెట్రిక్ టన్నులను మాత్రమే ఆమోదించిందని ఉత్తమ్ గుర్తుచేశారు. ఇప్పటికే సేకరించిన రబీ పంట నుండి మరో 10 లక్షల మెట్రిక్ టన్నులు తీసుకోవాలనీ, సేకరణ గడువును అక్టోబర్ 31 నుంచి 2026 జనవరి 31 వరకు పొడిగించాలని కోరారు.

## కాల్పుల విరమణకు ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

శాంతిని స్థాపించడం లక్ష్యమని తెలిపారు. హమాస్ తన ఆయుధాలను వదిలి, గాజాలో శాంతియుత ప్రభుత్వం ఏర్పడాలన్నదే ప్రధాని దృష్టి అని పేర్కొన్నారు. నెతన్యాహు హామీ ఇచ్చారు, గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాలను దశలవారీగా ఉపసంహరించుకుంటారు, సులభం కాకపోయినా ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. అంతేకాక, సెప్టెంబర్ 9న ఖతార్‌లో జరిగిన ఇజ్రాయెల్ దాడికి కూడా క్షమాపణ తెలిపారు.

హమాస్ ప్రతిక్రియా: అయితే, హమాస్ ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. తమకు ఇంకా ముసాయిదా అందలేదు అని తెలిపి, ఆయుధాలు విడిచిపెట్టే ప్రసక్తి లేదని స్పష్టం చేసింది.

ట్రంప్ సూచించిన 20 సూత్రాల ప్రణాళికలో: కాల్పుల విరమణ,బందీలను 72 గంటల్లో విడుదల చేయడం, హమాస్ నిరాయుధీకరణ, గాజా నుంచి ఇజ్రాయెల్ బలగాల ఉపసంహరణ, ట్రంప్ సారథ్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాట్ల వంటి అంశాలు ఉన్నాయి. ట్రంప్ హమాస్‌కు మూడు%–నాలుగు రోజుల గడువు మాత్రమే ఇస్తున్నట్లు వెల్లడించారు. మిగిలిన అన్ని పక్షాలు ఒప్పందంపై సంతకాలు చేశాయని, హమాస్ సంతకం చేయకపోతే కథ విషాదాంతం అవుతుందని హెచ్చరించారు.

## బీహార్‌లో 7.42 కోట్ల మంది ఓటర్లు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బీహార్ ఓటర్ల తుది జాబితాను మంగళవారం ప్రచురించారు. ఓటర్ల సంఖ్య స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ముందున్న 7.89 కోట్లకు దాదాపు న్యూఢిల్లీ/పాట్నా: అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న బీహార్ ఓటర్ల తుది జాబితాను మంగళవారం ప్రచురించారు. ఓటర్ల సంఖ్య స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ముందున్న 7.89 కోట్లకు దాదాపు 47 లక్షలు తగ్గి 7.42 కోట్లకు చేరుకుంది. ఆగస్టు 1నా జారీచేసిన ముసాయిదా జాబితాలోని 7.24 కోట్ల ఓటర్లకు తుది సంఖ్య 17.87 లక్షలు పెరిగింది. కాగా వలసలు,నకిలీ ఓటర్లు వంటి వివిధ కారణాల వల్ల అసలు జాబితా నుండి 65 లక్షల మంది ఓటర్లను తొలగించారు. పోలింగ్ ప్రక్రియలో అనుబంధ జాబితాలు ప్రచురించాక తుది సంఖ్య స్వల్పంగా మారవచ్చు. వచ్చే వారం అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉంది. %ూశ్రీంశీ క్ష్మముఃు% – అమెరికా ఒత్తిడి వల్ల ప్రతీకారం తీర్చుకోలేకపోయాం: చిదంబరం బీహార్‌లో అక్టోబర్ చివరి వారంలో జరుపుకునే ఛత్ పండుగ తర్వాత ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. సంభావ్య(ప్రాస్పెక్టివ్) ఓటర్లు సమర్పించిన పత్రాలు, పార్టీలు, వ్యక్తులు దాఖలు చేసిన అభ్యంతరాలను నెలరోజు పాటు మూల్యాంకనం చేసిన తర్వాత 3.66 లక్షల మంది ఓటర్లను ముసాయిదా జాబితా నుండి తొలగించగా, 21.53 మందిని చేర్చినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సన్నద్ధతను సమీక్షించడానికి ఎన్నికల అధికారి అక్టోబర్ 4, 5 తేదీలలో పాట్నాను సందర్శించనున్నారు. 243 మంది సభ్యులుండే బీహార్ అసెంబ్లీ పదవీ కాలం నవంబర్ 22తో ముగియనున్నది. 22 సంవత్సరాల విరామం తర్వాత స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)ను విజయవంతంగా పూర్తిచేసినందుకు బీహార్‌లోని ఓటర్లందరికీ, ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీలకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారని ఎన్నికల సంఘం తెలిపింది.




## నేటి నుంచి స్పీడ్ పోస్ట్ కొత్త చార్జీలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

స్పీడ్ పోస్ట్ చార్జీలను తపాలా శాఖ సవరించింది. సేవలను మెరుగుపర్చడం, నిర్వహణ ఖర్చులు పెరగడం, కొత్త విధానాలు అమలు చేయడం తదితర కారణాల వల్ల చార్జీలను సవరించినట్టు తెలిపింది. కొత్త ధరలు నేటి (బుధవారం) నుంచి అమల్లోకి వస్తాయని తెలంగాణ తపాలా సేవల సహాయక సంచాలకులు డీ నేమతుల్లా తెలిపారు. పార్శిల్ బరువు, దూరాన్నిబట్టి చార్జీలు పెరుగుతూ ఉంటాయని, దీనిపై అదనంగా జీఎస్టీ వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# తెలంగాణలో వర్షాల హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో వర్షాలు పడే జాబితా:

మంగళవారం: ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి.

బుధవారం: పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి.

గురువారం: రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.

శుక్రవారం: ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో కొద్దిగా భారీ వర్షాలు.

శనివారం: ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు.

జాగ్రత్తలు:

వర్షాలతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు కూడా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది.

## కక్ష ఉంటే నాపైన కేసులు పెట్టండి..

- **విజయ్**

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

_: కరూర్ సభలో తాను కాని, తన పార్టీ నిర్వాహకులు కాని ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించలేదని టీవీకే అధినేత విజయ్ తెలిపారు. తాము ఎటువంటి తప్పు చేయలేదని, కాని తన పార్టీ నాయకులు, సోషల్ మీడియా యూజర్లపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పతీకారం తీర్చుకోవాలనుకుంటే తనపైన తీర్చుకోవాలని, వారిని తాకవద్దని నేరుగా ముఖ్యమంత్రి స్టాలిన్ పేరు చెబుతూ విజయ్ సవాలు చేశారు. మరోవైపు క్రూరమైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా తమిళనాడులో కూడా జెన్‌జీ విప్లవం వస్తుందంటూ టీవీకే ప్రధాన కార్యదర్శి ఆధవ్ అర్జున మంగళవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.



## కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ..

- **పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కలెక్టర్ గా హరిత బాధ్యతలు స్వీకరించగా, ఎస్పీ మహేష్ బి గితే సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సామాజిక సమరసతను ప్రజలందరూ పాటించాలి

- **కరీంనగర్ జిల్లా పర్యావరణ ప్రముఖ్ బత్తిని ఆంజనేయులు**



**బలగం టీవీ, ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలం లోని పెద్ద లింగాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ దశమి ఉత్సవం లో ముఖ్య వక్త కరినగర్ జిల్లా పర్యావరణ ప్రముఖ్ బత్తిని ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 1925 ఈ విజయదశమి రోజున ప్రారంభమైందని 2025 విజయదశమి నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంది అన్నారు. శతజయంతి ఉత్సవాల్లో భాగంగా రాబోయే రోజులలో ప్రతి గ్రామంలో శాఖలు మరియు జనజాగరణ, హిందూ సమ్మేళనాలు, యువకుల సమ్మేళనాలు, ప్రతిష్ట వ్యక్తుల సమ్మేళనాలు, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 సంవత్సరముల కాలంలో అయోధ్యలో రామ మందిర నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు, తిరుమలలో ఏడుకొండలను, రామసేతును కాపాడుకోవడం లాంటివి అనేక విజయాలు సాధించాం అన్నారు. వరదలు, తుఫాను, భూకంప సమయాలలో కూడా సేవా కార్యక్రమాలను నిర్వహించడం, భారతదేశంతో పాకిస్తాన్, చైనా యుద్ధ సమయాలలో సైనికులకు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సహకారం అందించారు అని తెలియజేశారు. ప్రపంచం లోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థగా ఆర్ఎస్ఎస్ నిలబడింది అన్నారు. ఆర్ఎస్ఎస్ లో తయారైన టువంటి స్వయంసేవకులు అన్ని రంగాలలో పనిచేస్తున్నారని అన్నారు. పంచ పరివర్తన లో భాగంగా సమాజంలో కుల,వర్గ, మత భేదం లేకుండా ఉండడం, పౌర విధులు నిర్వర్తించడం, స్వదేశీ వస్తువులను వినియోగించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, కుటుంబ విలువలను కాపాడుకోవడం, పాటించడం విషయాలను తెలియజేయాలని చెప్పారు. ఈ కార్యక్రమం లో గుడిసెల జితేందర్ గౌడ్ , ఖండ కార్యవాహ తాటిపల్లి మహేష్, శారీరక్ ప్రముఖ్ కంకటి శ్రీకాంత్, ఉపమండల ప్రముఖ్ గురజాల రాజిరెడ్డి, పయ్యావుల ఎల్లయ్య , కోల సంతోష్, అమ్ముల అశోక్, ముత్యంరెడ్డి , మరియు వివిధ గ్రామాల స్వయం సేవకులు, ప్రజలు, వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## నూతన కలెక్టర్‌ను కలిసిన టీజీఓ రాజన్న సిరిసిల్ల బృందం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ని, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ తరపున నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు సమరసేన అధ్యక్షులు ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసిన సంఘం ప్రతినిధులు, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా అభివృద్ధిలో అధికారులందరి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు కలెక్టర్‌కు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జమీల్, సహాయ అధ్యక్షుడు జోగం రాజు, ఖజానాదారు ఎం.డి. రసూల్, ఉపాధ్యక్షుడు ఎం.డి. అబ్దుల్ వాజిద్, సభ్యుడు సాగర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎన్నికల ప్రవర్తన నియమావళి

## నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలి..

- **రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని**
- **స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన ఎన్నికల సంఘం కమిషనర్**
- **హాజరైన కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి గితే**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు . సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎంపిటిసి, జడ్పిటిసి, గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణ రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని వెల్లడించారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల జరిగిన నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే ఎన్నికలు జరిగే గ్రామీణ ప్రాంతాలలో అమలు లోకి రావడం జరుగుతుందని అన్నారు. ఎం.సి.సి నిబంధనల ప్రకారం 24 గంటలు, 48 గంటలు, 72 గంటల లోపు తీసుకోవాల్సిన చర్యలను చేపట్టే రిపోర్ట్ అందించాలని అన్నారు. బ్యాలెట్ బాక్స్, పోలింగ్ పర్సనల్ ట్రైనింగ్స్ సరిపోయేంత మెటీరియల్ అన్ని సరిగా చూసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈఓ వినోద్ కుమార్, డీపీఓ షర్ఫుద్దీన్, జడ్పీ డిప్యూటీ సీఈఓ గీత, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఈటీసీఏ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు..

- **ప్రత్యేక ఆకర్షణగా అతి పెద్ద బతుకమ్మ..**

**బలగం టీవీ, దుబాయి**




తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక అయిన తెలంగాణ పూల పండుగ బతుకమ్మ సంబరాలు తేదీ 28 సెప్టెంబర్ ఆదివారం రోజున దుబాయి లోని అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్ ఆడిటోరియంలో భారీ జన సందోహం నడుమ ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక మరియు వెల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో ఉదయం 10.00 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు ఎంతో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు మహబూబ్ నగర్ లోకసభ సభ్యురాలు డి.కె అరుణ, మెదక్ లోకసభ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు మరియు అతిథులుగా కాన్సులేట్ జనరల్ సతీష్ కుమార్ శివన్ , కార్యక్రమానికి స్పెషల్ అట్రాక్షన్ గా ప్రముఖ తెలంగాణ జానపద గాయనిలు మధుప్రియ, ముకుంద అలాగే ఫోక్ డాన్సర్స్ మౌనిక డింపుల్, లాస్య స్మైలీ మరియు అలాగే రెండు తెలుగు రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

దుబాయ్ లోని అల్ అహ్లీ స్పోర్ట్స్ క్లబ్ లో జరిగిన ఈ వేడుకలకు సుమారు 5000 పైగ తెలంగాణ ప్రవాసియులు పాల్గొన్న ఈ వేడుకల్లో ఉదయం నుండి మహిళా విభాగం ఆధ్వర్యంలో కార్యక్రమ వేదికలోనే ఆడపడుచులు రంగు రంగు పూలతో బతుకమ్మలను పేర్చారు, సప్తవర్ణల శోభితిమైన పూలదొంతరుల బతుకమ్మలు చూడముచ్చటగా కనిపించాయి. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడపడుచులు సాంప్రదాయ బతుకమ్మ పాటలు మరియు చప్పట్ల తో మారుమోగింది. కళాకారుల డప్పు వాయిద్యాలతో బతుకమ్మలను ఎదుర్కొనగా మహిళలు భక్తి శ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా గౌరీ దేవికి పూజలు జరిపి బతుకమ్మ ఆట పాటల, కోలాటాల నృత్యాల నడుమ వేడుక ప్రాంగణం పులకించింది. బతుకమ్మ పండుగ నేపథ్యం పై ప్రదర్శించిన జానపద సాంస్కృతిక నృత్య పోటీలు, చిన్న పిల్లల సాంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు అందరిని అలరించడం విశేషం, హాజరైన మహిళలకు బతుకమ్మ ప్రసాదం 2500 మందికి భోజనాలు నిర్వాహకులు ఏర్పాటు చేసారు.

ఈ సందర్భంగా ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు కిరణ్ కుమార్ పీచర మరియు అధ్యక్షులు జగదీష్ రావు చీటీ మాట్లాడుతూ.. 2011 నుండి క్రమం తప్పకుండా యూఏఈ గడ్డ మీద వందల మందితో ప్రారంభమైన మొదటి బతుకమ్మ ఈ రోజు వేలాది మంది తెలంగాణ కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవడం ఇలాంటి వేడుకలు మన సంప్రదాయాలను ఆచార వ్యవహారాలను పాటించడానికి ఇక్కడ పుట్టి పెరిగిన పిల్లలకు కూడా తెలంగాణ సంస్కృతి ని తెలియ చెప్పేలా ఇలాంటి కార్యక్రమాలు దోహద పడుతాయని, అలాగే %జుజూూ% అధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ యూఏఈలో ఉన్న తెలంగాణ ప్రజల ఐక్యత, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ, ఆపదలో ఉన్న తెలంగాణ బిడ్డలకు చేతనైనంత సహాయాన్ని అందించటం ఈటీసీఏ ఉద్దేశమని మరియు గత కొన్ని సంవత్సరాలుగా గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం పాటుపడుతూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించి మా గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు మాట్లాడుతూ, ఈటీసీఏ ఆద్వర్యం లో భారీ ఎత్తున నిర్వహించబడిన బతుకమ్మ సంబరాలు చూసి అలాగే 15 సంవత్సరాలుగా క్రమం తప్పకుండ ఈ వేడుకలను నిర్వహిస్తున్న ఈటీసీఏ వారి కృషిని అభినందించారు. ఈటీసీఏ సలహాలు సూచనలు తీసుకొని గల్ఫ్ కార్మికుల సమస్యలను మా తరపున ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని, వారిని అన్ని రకాలుగా ఆదుకుంటామని అన్నారు. అరబ్ దేశంలో బతుకమ్మ పండుగను నిర్వహించడం చాలా సంతోషాన్ని కలిగించిందని, ఇలాంటి సాంస్కృతిక పరమైన వేడుకలు భావితరాలకు మన ఆచార సంప్రదాయాలను తెలియచేయ డానికి దోహదపడుతాయని వారు కొనియా డారు. ఈ మెగా బతుకమ్మ సంబరాలకు మమ్మల్ని ఆహ్వానించిన ఈటీసీఏ కార్యవర్గానికి వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జానపద గాయినిలు మధుప్రియ, ముకుంద పాడిన బతుకమ్మ పాటలు శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసాయి. ఫోక్ డాన్సర్ మౌనిక డింపుల్ మరియు స్మైలీ లాస్య ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నపిల్లలు సైతం సాంప్రదాయ దుస్తుల్లో "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" అంటూ చప్పట్లతో హుషారుగా ఆడిపాడటం అందరిని ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలందరు కలిసి ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు. తెలంగాణ కు తలమానికమైన బతుకమ్మ సంబరాలను గొప్పగా జరుపుకోవడం చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు తీసుకొచ్చిన రంగు రంగు పూల బతుకమ్మలు చూపరులను ఎంతగానో ఆకర్షించాయి. ఈటీసీఏ మహిళ విభాగం సభ్యులు చే ప్రత్యేకంగా తయారుచేసిన అతి పెద్ద బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు అందమైన బతుకమ్మలను ఎంపిక చేసి, బతుకమ్మ పాటల పోటీలు, సాంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈటీసీఏ మహిళా సభ్యులచే ప్రదర్శించబడిన సాంస్కృతిక కార్యక్రమాలు–బతుకమ్మ కోలాటాలు, జానపద నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. "వెళ్లి రావమ్మ బతుకమ్మ" అంటూ గౌరమ్మను తలుస్తూ బతుకమ్మలను ఏర్పాటు చేసిన కొలనులో నిమ్మజ్జనం చేశారు. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి బతుకమ్మ ప్రసాదంను అందించారు. ఈ సంబరాల్లో ఈటీసీఏ వ్యవస్థాపక అధ్యక్షులు కిరణ్ కుమార్ పీచర, అధ్యక్షులు జగదీష్ రావు చీటీ, జనరల్ సెక్రటరీ రాణి కోట్ల, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అలిగేటి, జాయింట్ సెక్రటరీ శేఖర్ గౌడ్ గుండవేని, కోశాధికారి తిరుమల్ రావు మరియు ఎక్జిక్యూటివ్ కమిటీ సభ్యులు వినోద్ ఆచార్యులు, సారిక పీచర, అన్నపూర్ణ, సామ శ్రీనివాస్ రెడ్డి, రఘు అలిగేటి, రమణ స్వర్గం, రాము కందుకూరి, సంతోష్ కుమార్, మధు కుమార్, రాజేష్ పోలంపల్లి, వనజ, రాము జల, మమత కస్తూరి, కార్తీక్ రెడ్డి, అజహర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచకప్‌లో భారత్ శుభారంభం



**బలగం టీవీ, హైదరాబాద్**

సొంత గడ్డపై జరుగుతున్న వన్డే ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు బోణీ కొట్టింది. అఖిల భారత క్రికెట్ అభిమానులను ఉత్సాహంలో ముంచెత్తుతూ, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (53బీ 3/54) బ్యాట్, బంతితో చెలరేగి భారత్‌కు విజయం అందించింది. అమన్‌జోత్ కౌర్ (57), దీప్తిల అర్ధశతకాలతో నిలకడగా నిలిచిన భారత్, 269 పరుగుల లక్ష్యాన్ని కాపాడి శ్రీలంకను 59 పరుగుల తేడాతో ఓడించింది.

టాప్ ఆర్డర్ విఫలమైనా% అమన్‌జోత్ దీప్తిల మధ్య ఏడో వికెట్‌కు శతక భాగస్వామ్యం భారత్‌ను ఆదుకుంది. 124/6 క్లిష్టస్థితి నుంచి 269/8 స్కోరు బోర్డుపై ఉంచారు. శ్రీలంక స్పిన్నర్ ఇనోకా రణవీర (4/46) వికెట్ల వేట సాగించినా, భారత జట్టు నిలకడగా నిలబడింది.

269 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక 211కే ఆలౌటైంది. చమరి ఆటపట్టు (43) ప్రయత్నించినా, దీప్తి మ్యాజిక్ బంతులు లంకను కుప్పకూల్చాయి. స్నేహ్ రానా (2/32), తెలుగు అమ్మాయి శ్రీ చరణి (2/37) కీలక వికెట్లు తీసి భారత్ గెలుపు ఖరారు చేశారు. నిలాక్షి డిసిల్వా (35) కొంత ప్రతిఘటించినా, ఆ తర్వాత లంక ఇన్నింగ్స్ పూర్తిగా కూలిపోయింది.

ఈ విజయంతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన వన్డే వరల్డ్‌కప్‌లో తొలి అడుగును ఘనంగా వేసింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో సమష్టి ప్రదర్శన కనబరచిన భారత్, టైటిల్ వేటలో బలమైన సంకేతం ఇచ్చింది.




# జపాన్ ఓపెన్ ఫైనల్ జయభేరి..

- **ఏడాదిలో ఎనిమిదో టైటిల్ అల్కరాజ్ ఖాతాలో**

**బలగం టీవీ, టోక్యో**

వరల్డ్ నంబర్ 1 కార్లోస్ అల్కరాజ్ జోరు ఆగడం లేదు. తాజాగా యూఎస్ ఓపెన్ కప్‌ను ఎత్తుకున్న ఈ స్పానిష్ స్టార్.. మంగళవారం జరిగిన జపాన్ ఓపెన్ ఫైనల్‌లో అమెరికన్ టేలర్ ఫ్రిట్జ్‌ను 6-4, 6-4 తేడాతో ఓడించి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. ఈ విజయంతో ఈ సీజన్‌లో 68వ గెలుపు, ఎనిమిదో టైటిల్ దక్కించుకున్నాడు. అల్కరాజ్ ధాటికి ఫ్రిట్జ్ నిలువలేక పోయాడు. రెండు సెట్లలోనూ దూకుడు ప్రదర్శించిన అల్కరాజ్, లావెర్ కప్‌లో జరిగిన ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు. ఈ ట్రయంఫ్‌తో అతడి ఏటీపీ టూర్ కెరీర్‌లో 24వ టైటిల్ ఖాతాలో చేరింది.

"టోక్యోలో అభిమానుల ముందు ఫైనల్ ఆడటం ఒత్తిడిగా అనిపించినా.. ప్రతి క్షణం ఆస్వాదించాను. గాయం సమస్య ఉన్నా ట్రోఫీ గెలవడం ప్రత్యేక అనుభూతి" అని మ్యాచ్ అనంతరం అల్కరాజ్ ఆనందం వ్యక్తం చేశాడు.




## 'మహాకాళి'లో అక్షయ్ ఖన్నా ఫస్ట్ లుక్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన 'హనుమాన్' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో భారీ విజయాన్ని సాధించిన సంగతి తెలిసిందే. దాని సీక్వెల్‌గా 'జై హనుమాన్' తెరకెక్కుతున్న వేళ, మరో కొత్త ప్రాజెక్ట్ 'మహాకాళి' రూపుదిద్దుకుంటోంది. పూజ అపర్ణ కొల్లూరు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం భారతదేశ తొలి ఫీమేల్ సూపర్ హీరో మూవీగా ప్రత్యేకతను సంతరించుకుంది. ఆర్‌కేడీ స్టూడియోస్ పతాకంపై రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కీలక పాత్రలో నటిస్తున్నారు. దసరా సందర్భంగా ఆయన ఫస్ట్ లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఇందులో అక్షయ్ అసురుల గురువు శుక్రాచార్యగా కనిపించి ఆకట్టుకున్నారు. బెంగాల్ నేపథ్యంలో కాళీదేవి ప్రధానంగా నడిచే ఈ కథ, మహిళా సాధికారత, ధైర్యం, విశ్వాసంకు ప్రతీకగా నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని ఐమాక్స్ 3డీతో సహా భారతీయ, విదేశీ భాషల్లో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



## "నేను చేయని తప్పునకు బలి చేశారు"

**నటి హేమ**

**బలగం టీవీ, విజయవాడ**

టాలీవుడ్ సీనియర్ నటి హేమ కన్నీళ్ల పర్యంతమయ్యారు. దేవి నవరాత్రుల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. "ప్రతి ఏటా దుర్గమ్మ దర్శనానికి వస్తాను. కానీ ఈ ఏడాది ప్రత్యేకమైనది. గత ఏడాది నాపై వేసిన నిందలను దుర్గమ్మ తుడిచిపెట్టింది. నేను చేయని తప్పునకు నన్ను బలి చేశారు. దాని నుండి బయటపడటం చాలా కష్టమైంది. కానీ దుర్గమ్మ నాకు కొండంత ధైర్యం ఇచ్చింది. 'నేనున్నాను నువ్వు ముందుకెళ్లు' అని నన్ను బతికించింది. ఎన్ని జన్మలెత్తినా అమ్మ ఆశీస్సులు మర్చిపోలేను" అని హేమ కన్నీళ్లతో చెప్పారు. అలాగే మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తూ "మీరు వార్త రాయేటప్పుడు దయచేసి నిజాలు తెలుసుకుని రాయండి. తప్పు ఆరోపణలు ఒక్కొక్కరి జీవితాన్ని నాశనం చేస్తాయి" అని కోరారు.

కొన్ని నెలల క్రితం బెంగళూరులో జరిగిన ఓ రేవ్ పార్టీ కేసులో హేమ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. డ్రగ్స్ టెస్టుల్లో ఆమెకు పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించడంతో ఆమెపై కేసు నమోదైంది. అయితే అనంతరం కోర్టు స్టే ఇవ్వడంతో హేమకు కొంత ఊరట లభించింది. ప్రస్తుతం ఆ కేసు ఇంకా విచారణలోనే ఉంది.



## 'జటాధర' నుంచి సోనాక్షి ఉగ్రరూపం

**'ధన పిశాచి' పాట అదిరింది**

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ హీరో సుధీర్ బాబు, బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ద్విభాషా చిత్రం జటాధరపై ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్ నుంచి తాజాగా దుర్గాపూజ పర్వదినం సందర్భంగా 'ధన పిశాచి' పాటను విడుదల చేశారు.

ఈ గీతంలో సోనాక్షి మునుపెన్నడూ చూడని ఉగ్రరూపంలో దర్శనమిచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆమె హావభావాలు, డ్యాన్స్ మూమెంట్స్ పాటకు కొత్త శక్తినిచ్చాయి. భారీ సెట్‌లో చిత్రీకరించిన ఈ గీతానికి సమీర కొప్పికర్ సంగీతం అందించగా, మధుబంతి బాగ్చి స్వరపరిచారు. "దైవిక స్త్రీ శక్తిని ప్రతిబింబించే తాండవ గీతంలా ఈ పాటను తీర్చిదిద్దాం. ఊహించిన శక్తి, పవర్‌ను మ్యూజిక్ ద్వారా వ్యక్తపరచడం చాలా సంతృప్తి ఇచ్చింది" అని సంగీత దర్శకురాలు సమీర తెలిపారు.

ఇటీవలే విడుదలైన 'సోల్ ఆఫ్ జటాధర' థీమ్ సాంగ్ కూడా ప్రేక్షకుల ఆదరణ పొందిన విషయం తెలిసిందే. 'ఓం నమః శివాయ' మంత్రంతో సాగిన ఆ గీతం సినిమా ఆధ్యాత్మిక తత్త్వాన్ని బలంగా వ్యక్తం చేసింది. ఈ చిత్రంలో దివ్యా ఖోస్లా, శిల్పా శిరోద్కర్, ఇందిరా కృష్ణ, రవి ప్రకాశ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జీ స్టూడియోస్, ఉమేశ్ కేఆర్ బన్సల్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ ద్విభాషా చిత్రం నవంబర్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## 'తెలుగుతల్లి' ఇకపై 'తెలంగాణ తల్లి ఫ్లైఓవర్'

**బలగం టీవీ, హైదరాబాద్**

నగరంలోని ప్రముఖ ఫ్లైఓవర్ అయిన తెలుగుతల్లి ఫ్లైఓవర్ పేరును ఇకపై తెలంగాణ తల్లి ఫ్లైఓవర్గా మార్చుతున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ అధికారులు నూతన సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. లోయర్ ట్యాంక్ బండ్ నుంచి సచివాలయం వరకు విస్తరించి ఉన్న ఈ ఫ్లైఓవర్‌కు కొత్త పేరు పెట్టడం రాష్ట్ర ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించేలా ఉందని అధికారులు తెలిపారు. గమనించదగిన విషయం ఏమిటంటే, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2005లో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఈ ఫ్లైఓవర్‌ను ప్రారంభించి తెలుగుతల్లి ఫ్లైఓవర్గా నామకరణం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత పేరు మార్పు కోసం డిమాండ్ చాలాకాలంగా కొనసాగింది.




## 'ఓజీ'పై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసల వర్షం

**బలగం టీవీ, హైదరాబాద్**



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ తాజా చిత్రం 'ఓజీ' బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ.250 కోట్ల వసూళ్లు నమోదు చేసి కలెక్షన్ల వర్షం కురిపించింది. ఈ విజయంపై మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేక స్పందన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సినిమా వీక్షించిన అనంతరం ఆయన సోషల్ మీడియాలో తన అభిప్రాయం పంచుకున్నారు. "ఓజీ హాలీవుడ్ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోని సినిమా. ప్రతి సన్నివేశం అద్భుతంగా తెరకెక్కింది. అండర్‌వరల్డ్ గ్యాంగ్‌స్టర్ కథ అయినప్పటికీ భావోద్వేగాలు ఎక్కడా తగ్గలేదు" అని చిరంజీవి పేర్కొన్నారు. పవన్ నటనపై ప్రశంసలు కురిపిస్తూ "తనదైన ఆకర్షణతో సినిమాను నిలబెట్టాడు. అభిమానులకు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న విందు ఇచ్చాడు" అన్నారు. దర్శకుడు సుజిత్ దిశానిర్దేశం, తమన్ అందించిన నేపథ్య సంగీతం, అద్భుతమైన విజువల్స్ గురించి కూడా మెగాస్టార్ పొగిడారు.